నమస్తే తెలంగాణ

# జగిత్యాల

3 | కరీంనగర్, ఆదివారం 14 జనవరి 2024 | JAGTIAL

## వైద్యులపై కలెక్టర్ కొరడా

**కరీంనగర్ జనరల్ దవాఖాన డాక్టర్లు, సిబ్బందికి షోకాజ్‌లు, మెమోలు**

కరీంనగర్ విద్యానగర్, జనవరి 13 : ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న పలువురు వైద్యులు, సిబ్బందిపై కలెక్టర్ పమేల సత్పతి కొరడా ఝులిపించారు. కొంత కాలంగా ఒకవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు వైద్య అధికారుల నుంచి పరస్పరం వెల్లువెత్తుతున్న ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. కొద్ది రోజుల క్రితం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ప్రభుత్వ దవాఖాన సిబ్బంది పనితీరుపై ఫిర్యాదు చేయగా, ఇదే సమయంలో ప్రజాప్రతినిధులపై వైద్య సిబ్బంది ఒకరు ఫిర్యాదు చేశారు. ఈ పరిస్థితులను కలెక్టర్ పరిగణలోకి తీసుకొని, జిల్లా వైద్యాధికారి లలితాదేవితో విచారణ జరిపించారు. ఆ మేరకు ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, పిల్లల వైద్యుడు డాక్టర్ అజయ్‌కుమార్, ఫిజీషియన్ వైద్యుడు డాక్టర్ కనకం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఆఫీస్ సూపరింటెండెంట్, ఆఫీస్ ఏవో, సంబంధిత క్లర్క్‌లకు మెమోలు జారీ చేశారు. ఆర్ఎంవో డాక్టర్ జ్యోతిని జమ్మికుంటకు పంపిస్తూ వర్క్ ఆర్డర్‌తోపాటు మెమో ఇచ్చారు. షోకాజు నోటీసులు, మెమోలకు వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. దవాఖానకు పూర్తి స్థాయిలో డీసీహెచ్ఎస్‌ను నియమించాలని కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది.



పెగడపల్లి : బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

## ఢిల్లీ పెద్దలకు రైతులు తాకట్టు

- రుణాలు పొందేందుకు ఎఫ్ఆర్‌బీఎంపై సీఎం రేవంత్ సంతకం
- వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టేందుకే జియో ట్యాగింగ్
- బీఆర్ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యంతో ఉండాలి
- రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెగడపల్లిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

పెగడపల్లి, జనవరి 13 : సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతంగాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెట్టారని, అప్పులు తీసుకొచ్చేందుకు ఎఫ్ఆర్‌బీఎంపై సంతకం చేశారని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పెగడపల్లిలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేంద్రం అమలు చేసిన విద్యుత్ సంస్కరణలను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకిస్తే, కాంగ్రెస్ పార్టీ మాత్రం వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టేందుకు జియో ట్యాగింగ్ చేస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తి విఫలమైందని, ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, కాంగ్రెస్ హామీలను ప్రశించాలని పిలుపునిచ్చారు. అధిష్టానం ఆదేశిస్తే పెద్దపల్లి ఎంపీ బరిలో పోటీలో ఉంటానని, టికెట్ ఎవరికి వచ్చినా, పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు వోరుగంటి రమణారావు, ఎంపీపీ శోభా-సురేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, రాజశేఖర్, వైస్ ఎంపీపీ గంగాధర్, విండో చైర్మన్ వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

## సమాచార రంగంలో సంచలనం ఎస్ఎంఎస్

- షార్ట్ మెసేజ్ సర్వీస్‌కు 38 ఏండ్లు
- జర్మనీలో పుట్టి ప్రపంచ దేశాలకు విస్తరణ
- ప్రతి ఒక్కరితో పెనవేసుకున్న 'సంక్షిప్త' బంధం
- అన్ని రంగాల్లోనూ సేవలకు కీలకం
- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- వాణిజ్య పరంగా కోట్లాది రూపాయల మార్కెట్
- ప్రపంచ వ్యాప్తంగా సెకన్‌కు 15 లక్షలకు పైగా మెసేజ్‌లు
- వ్యాపారాభివృద్ధికి వినియోగిస్తున్న కంపెనీలు

**షార్ట్ మెస్సేజ్ సర్వీస్.. దీనినే ముద్దుగా ఎస్ఎంఎస్ అంటాం. ఇది పుట్టి 38 ఏండ్లు అవుతున్నది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ లాంటివి ఎన్నో పుట్టుకొచ్చినా ఎస్ఎంఎస్‌కు ఆదరణ తగ్గకపోగా, రోజురోజుకూ పెరుగుతున్నది. వ్యాపార విస్తరణ.. డాక్టర్ల అపాయింట్‌మెంట్స్.. ఆఫర్లు.. నోటిఫికేషన్లు.. అలర్ట్‌లు.. ఇలా ఏ రంగంలో చూసినా కీలకంగా మారింది. సంతోషం, దుఃఖం.. పుట్టిన రోజు, పెళ్లి రోజు.. ఇలాంటి అన్నింటిలోనూ పైచేయి సాధిస్తున్నది. జర్మనీలో మొదలైన ఈ చిట్టి సందేశం సమాచార రంగంలో పెను సంచలనం సృష్టిస్తున్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలకూ విస్తరించి, కోట్లాది రూపాయల వ్యాపారానికి పెట్టుబడిగా మారిన ఎస్ఎంఎస్‌పై ప్రత్యేక కథనం..**




**నాటి రాయబారుల సందేశాలను మరిపిస్తూ.. పావురాల వేగాన్ని మించుతూ.. ఉత్తరాలను మోసే ఊసులను క్షణంలోనే ఎదుటి వారికి చేరవేస్తున్నదీ పొట్టి సందేశం! సెల్లుగూటిలో నిక్షిప్తం చేసిన మన భావాలను, అభిప్రాయాలను సెకను కాలంలో పంచుతున్నదీ ఎస్ఎంఎస్! ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని పంపించడం చాలా ఈజీ అయిపోయింది. లక్షకుపైగా మందికి ఒకేసారి సందేశాన్ని పంపించే అవకాశం ఉన్నది.**

కరీంనగర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): షార్ట్ మెసేజ్ సర్వీస్ (ఎస్ఎంఎస్) 1985లో అందుబాటులోకి వచ్చింది. జర్మనీలోని ఓస్లోలో 1985లో జరిగిన గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్ (జీఎస్ఎం) సమావేశంలో జర్మనీ-ఫ్రాన్స్ సహకారంలో ఈ సేవలను ప్రారంభించారు. మొదటిసారిగా రిక్కూ పెహ్కనెన్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి తన జీఎస్ఎం ఫోన్ నుంచి 'మెర్రీ క్రిస్మస్' అనే ఓ సందేశాన్ని పంపారు. అప్పుడు 160 అక్షరాలతో ఆరంభమైన ఎస్ఎంఎస్ నేడు ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తూనే ఉన్నది. మాటలను పొదుపు చేసిన ఎస్ఎంఎస్ మార్కెట్‌లో మాత్రం తిరుగులేని ఆధిపత్యాన్ని సాధిస్తున్నది. 2006లో దీని మార్కెట్ విలువ 21 బిలియన్ డాలర్లు ఉండగా, 2023 నాటికి 77.29 బిలియన్ డాలర్లకు చేరింది. 2033 నాటికి 129.54 బిలియన్ డాలర్లను అధిగమిస్తుందని అంచనా.

ఓ పది మందితో ఫోన్ మాట్లాడాలంటే ఇబ్బందే. ఎక్కువగా మాట్లాడితే విసుగొస్తుంది. అయినా, ప్రతి దానికి ఫోన్ మాట్లాడలేం. కొన్నిసార్లు ఇతరుల విలువైన సమయాన్ని హరించిన వాళ్లమూ అవుతాం. అందుకే ఎస్ఎంఎస్‌కు ప్రాధాన్యం పెరుగుతూనే ఉన్నది. మనదేశంలోనే కాదు, ఇతర దేశాల్లోనూ వాడకం విపరీతంగా ఉంటున్నది. స్నేహితులతో ముచ్చటించేందుకే కాదు, బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడానికి, పరీక్ష ఫలితాలు, మొబైల్ బిల్స్, ప్రయాణ వివరాలు తెలుసుకోవడంతోపాటు ఇతర సమయాల్లోనూ ఈ మెసేజ్ కీలకమవుతున్నది.

### పెరుగుతున్న క్రేజ్

ఏటా ఎస్ఎంస్ మార్కెట్ విలువ విస్తరిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 23 బిలియన్ల మంది ఎస్ఎంఎస్‌లు వినియోగిస్తున్నట్లుగా తాజా సర్వేల్లో వెల్లడైంది. ప్రపంచ గణాంకాల ప్రకారం చూస్తే అన్ని నెట్‌వర్క్‌ల నుంచి కలిపి సెకన్‌కు 15.97 లక్షల మెస్సేజ్‌లు వెళ్తున్నాయంటే ఈ పొట్టి సందేశం ఎంతగా అల్లుకు పోయిందో అర్థమవుతున్నది. మన దేశంలో చూస్తే.. ప్రతి నెలా సగటున ఒక భారతీయుడు 29 నుంచి 60 మెస్సేజ్‌లు వినియోగిస్తున్నట్టు పలు నివేదికల్లో వెల్లడైంది. ఈ శాతం రోజురోజుకూ పెరుగుతున్నది. ముంబై, కోల్‌కతా, బెంగళూర్, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌లో 80 శాతానికి పైగా మంది ఎస్ఎంఎస్‌లు ఉపయోగిస్తున్నారు. రోజువారీగా చూస్తే.. యువకులు 72 శాతం, 18 నుంచి 24 ఏండ్ల మధ్య వయసున్న వారు 82 శాతం, 25 నుంచి 35 ఏండ్ల వయసున్న వారు 78 శాతం, 35 నుంచి 49 ఏండ్ల వారు 63 శాతం, 50 నుంచి 64 ఏండ్ల వారు 39 శాతం, 65 ఏళ్ల పై బడిన వారు 30 శాతం మంది ఈ పొట్టి సందేశానికి దాసోహమంటున్నారు.

మెసేజ్.. ఎన్నో అనుభూతులకు వేదిక. సంతోషాలను పంచుకునేందుకు.. ప్రేమను వ్యక్తం చేసేందుకు.. స్నేహాన్ని విస్తరించేందుకు.. బంధాలను ధ్రుడపరిచేందుకు.. క్షమాపణలు తెలిపేందుకు.. శుభాకాంక్షలు చెప్పేందుకు ఉపయోగపడుతాయి. కొన్ని సందేశాలు నవ్విస్తాయి.. మురిపిస్తాయి.. మరికొన్ని ప్రేమను పంచుతాయి.. ఇంకొన్ని బాధల్లో భరోసానిస్తాయి.. కొత్త అవకాశాలను కల్పించే కల్పతరువులవుతాయి.. అందుకే పాఠశాలలకు వెళ్లే పిల్లాడి నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరినీ ఆకర్శిస్తున్నాయి. రోజురోజుకూ మరింతగా చేరువవుతున్నాయి.

### మార్కెట్ విలువ ₹40 వేల కోట్లపైనే

ఎస్ఎంఎస్ ఓ మార్కెటింగ్ టూల్‌గానూ విస్తరించింది. అన్ని వాణిజ్య ప్రకటనలు మెసేజ్‌ల ద్వారానే వినియోగదారులకు చేరే సదుపాయం అందుబాటులోకి రావడంతో మరింతగా విస్తరిస్తున్నది. తమ ఉత్పత్తులపై తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రచారానికి బల్క్ ఎస్ఎంస్ పద్ధతిని వినియోగిస్తున్నారు. మొబైల్స్‌కు వస్తున్న వాణిజ్య ప్రకటనలను చూసి ప్రతి ముగ్గురిలో ఒకరు స్పందిస్తున్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది. తద్వారా ఆ ఉత్పత్తుల అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య ఎస్ఎంఎస్‌ల మార్కెట్ విలువ దాదాపు ₹40 వేల కోట్ల పైనే ఉంటుందని వివిధ సర్వేలు చెబుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. మార్కెట్ యావత్తు ఎస్ఎంఎస్‌లతో విడదీయలేని బంధం ఏర్పడింది. దవాఖానలు, ట్రావెల్స్, విమాన టికెట్లు, కార్గోలు, హెల్త్‌కేర్, అలర్ట్‌లు, బ్యాంకు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఓటీపీలు ఇలా ఏ రంగంలోనైనా ఎస్ఎంఎస్ ప్రముఖ పాత్ర పోషిస్తున్నది.

### పోటీల నిర్వహణకూ పొట్టి సందేశం

సందేశాలను పంపేందుకే కాదు.. పోటీలు నిర్వహించేందుకూ ఈ పొట్టి సందేశాన్ని వినియోగిస్తున్నారు. టీవీ చానెళ్లు, రేడియోలు, వెబ్‌సైట్లు, ఇలా అన్నింటా ఎస్ఎంఎస్ కాంటెస్ట్ హవా కొనసాగుతున్నది. అందులో టీవీలు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. టీవీల్లో జరిగే పోటీలు దాదాపు 86.9 శాతం ఎస్ఎంఎస్‌ల ద్వారానే సాగుతున్నాయి. రేడియోల్లో 38.9 శాతం, వెబ్‌సైట్లలో 50.7 శాతం, పత్రికల్లో 48.2 శాతం, మ్యాగజైన్లలో 37.3 శాతం పోటీలకు ఈ బుల్లి సందేశాలను వినియోగిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా టీవీల్లో జరిగే ఎస్ఎంఎస్ కాంటెస్టుల ఆదాయం నెలకు రూ.వేల కోట్లలో ఉంటుంది. 160 అక్షరాలతో ప్రారంభమైన పొట్టి సందేశం వ్యాపారంలో మాత్రం లెక్కలను మించుతున్నది. 38 సంవత్సాలు పూర్తి చేసుకుంటున్న ఈ ఎస్ఎంఎస్‌కు సమాచార రంగంలో ఎప్పుడూ రారాజుగానే ఉంటుందని నిపుణులు చెపుతున్నారు. భవిష్యత్తులో ఎలాంటి విప్లవాలు వచ్చినా.. ఎస్ఎంఎస్ స్థానం మాత్రం పదిలమే అంటున్నారు.

## టెక్స్‌టైల్ పార్క్‌లో 16 నుంచి పరిశ్రమలు షురూ




టెక్స్‌టైల్ పార్క్ ప్రధాన గేటు

సిరిసిల్ల రూరల్, జనవరి 13: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఈనెల 16 నుంచి పరిశ్రమలు తెరుచుకోనున్నాయి. ఈ నెల ఒకటి నుంచి టెక్స్‌టైల్ రంగం సంక్షోభంతోపాటు ప్రభుత్వ ఆర్డర్లు రాకపోవడంతో నిరవధిక బంద్ పాటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మికుల ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం దిగివచ్చి యథావిధిగా టెక్స్‌టైల్ పార్క్‌కు రాజీవ్ విద్యామిషన్ ఆర్డర్లు అందిస్తూ ఉత్తర్వుల జారీ చేసింది. దీంతో ఈ నెల 16 నుంచి టెక్స్‌టైల్ పార్క్‌లోని పరిశ్రమలను యథావిధిగా ప్రారంభిస్తామని టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వీఎం ఆర్డర్లు అందించిన చేనేత జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జౌళీశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణికి పార్క్ అసోసియేషన్ సభ్యులు,యజమానులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్ఐఆర్ కాపీ ఎక్కడి నుంచి తెస్తం?

- శాంతియుతంగా పోరాడిన వాళ్లు ఉద్యమకారులు కాదా?
- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ప్రశ్న
- ప్రతి ఉద్యమకారుడికి అవకాశం కల్పించాలని డిమాండ్



మాట్లాడుతున్న ఉద్యమకారుల జేఏసీ నాయకులు

గోదావరిఖని, జనవరి 13 : ''తెలంగాణ కోసం నాడు శాంతియుతంగా ఉద్యమ పోరు జరిపిన వాళ్లు ఉద్యమకారులు కాదా?, వాళ్లు ఎఫ్ఐఆర్ కాపీ ఎక్కడి నుంచి తెస్తరు?'' అని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకు లు ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకా ల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయనున్న ఆరు గ్యారంటీ పథకాల్లో ఉద్యమకారులను కూడా చేర్చిందని, కానీ దరఖాస్తు ఫారంలోని చివరి కాలం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అడిగిన బ్లాక్ నంబర్ 02లోని సబ్ క్లాజ్‌లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ఎఫ్ఐఆర్ నంబర్, జైలుకు వెళ్లిన వివరాలు అడుగుతున్నదని, శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించిన వారికి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అలాంటి వా రికి కూడా అవకాశం కల్పించి లబ్ధిచేకూరే విధం గా ఒక క్లాజును చేర్చాలని కోరారు. సమావేశం లో విజయానంద్, అమరేందర్‌రావు,జేవీ రాజు, తూముల అశోక్, ఏలేశ్వరం వెంకటేశ్, కానుగంటి శ్రీనివాస్, విజయ్‌కుమార్, రాజేశ్ శర్మ, సమ్మారావు, అందె సదానందం పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విద్యా సదస్సుకు డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి



కొత్తిరెడ్డి మల్లారెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 13: థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మాయి యూనివర్సిటీలో వచ్చే నెల 15 నుంచి 19 దాకా జరుగనున్న నాలుగో ఆగ్నేయాసియా అంతర్జాతీయ విద్యాసదస్సులో ఎస్సారార్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి పత్రసమర్పణ చేయనున్నారు. ఈ మేరకు సదస్సు నిర్వాహకులైన చియాంగ్ మాయి యూనివర్సిటీ, అంతర్జాతీయ అకాడమిక్ ఫోరం నుంచి ఆహ్వానం అందినట్లు మల్లారెడ్డి తెలిపారు. నూతన విద్యావిధానం 2020లో భాగంగా 'ఉన్నత విద్యలో కరికులం, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్, వ్యవస్థాపన అభివృద్ధికి మార్గాలు' అంశంపై పత్రసమర్పణ చేస్తున్నట్టు చెప్పారు. సదస్సులో పాల్గొనేందుకు కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం నుంచి అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. మల్లారెడ్డికి ఆహ్వానం రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి, సంఘం జిల్లా బాధ్యులు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ జీ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు టీ రాజయ్య, టీ ప్రమోద కుమార్, శ్రీనివాస్, పీ రాజు, విశ్వప్రసాద్, శారద, కామరాజు, నాగరాజు అభినందనలు తెలిపారు.

## ట్రాక్ వెహికిల్‌కు వ్యాగన్ల ఢీ

- రామగుండంలో రైల్వే స్టేషన్ వద్ద ఘటన
- తప్పిన పెనుప్రమాదం



రామగుండం రైల్వేస్టేషన్ వద్ద సిమెంట్ గోడమీదికి ఎక్కిన యుటిలిటీ ట్రాక్ వెహికిల్

జ్యోతినగర్(రామగుండం), జనవరి 13 : రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలోని యార్డు ఏరియాలో గూడ్స్ ఖాళీ వ్యాగన్లు యుటిలిటీ ట్రాక్ వెహికిల్‌ను ఢీకొట్టాయి. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం కానీ, ఆస్తి నష్టం కానీ జరుగలేదు. వివరాల్లోకి వెళితే.. రామగుండం రైల్వేస్టేషన్‌లోని యార్డు ఏరియాలో 46 ఖాళీ వ్యాగన్లకు మరమ్మతులు పూర్తి చేసిన అధికారులు, వాటిని ఆర్ఓహెచ్ సిక్‌లైన్ నుంచి రన్నింగ్ లైన్‌లోకి తీసుకొచ్చారు. అయితే, అవి నిలపాలనుకున్న పాయింట్ నుంచి ఓ 100 మీటర్లు ముందుకు దూసుకెళ్లి ముందున్న యుటిలిటీ ట్రాక్ వెహికిల్‌ను ఢీకొట్టాయి. దీంతో ఆ వెహికల్ సైతం ముందుకు వెళ్లి అడ్డుగా ఉన్న సిమెంట్ గోడపైకి ఎక్కింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. వ్యాగన్లకు ఉన్న ఇంజెన్ కనెక్షన్‌ను కట్‌చేసే లోపు రోల్ జరిగి ఉండొచ్చని, బ్రేక్ పవర్ చివరి వరకు లేకపోవడంతో క్లపింగ్ ఆన్ క్లపింగ్ జరుగడం మరో కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు.



క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## హామీలన్నీ నెరవేరుస్తాం

- ఖజానాలో నిధులు లేకున్నా ఇప్పటికే బస్సు ఫ్రీ, రాజీవ్ ఆరోగ్యశ్రీని తెచ్చాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మంథని/మంథని రూరల్, జనవరి 13: ప్రభుత్వ ఖజానాలో నిధులు లేక పోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంథనిలో శనివారం ఆయన పర్యటించారు. ముందుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరాంభట్ల సంతోషిణీ-శ్రీనివాస్ ఇంట్లో తేనేటి విందును స్వీకరించారు. తర్వాత మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిలో సినిమా థియేటర్‌ను ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మంథని మండలానికి చెందిన 17 మంది, కమాన్‌పూర్ మండలానికి చెందిన నలుగురికి, రామగిరి మండలానికి చెందిన ఇద్దరికి, పాలకుర్తి మండలానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. బోయినిపేటలోని శ్రీ లక్ష్మీదేవర ఆలయంలో పూజలు చేశారు. మంథని మండలం నాగారంలో నూతన పంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డును ప్రారంభించి, మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని కాంగ్రెస్‌కు పట్టం గట్టడం చాలా సంతోషంగా ఉందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10లక్షల వైద్య సదుపాయం కల్పించామని వివరించారు. త్వరలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గృహజ్యోతి పథకం ద్వారా మంజూరు చేస్తామని, ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కొండ శంకర్, శశిభూషన్‌కాచే, వొడ్నాల శ్రీనివాస్, పెంద్రు రమాదేవి, బూడిద మల్లేశ్, తోట్ల తిరుపతియాదవ్, రాజు ఉన్నారు.



## సిరుల 'బోగి'

- నేటి నుంచి రంగుల కేళి
- కళ కళ లాడనున్న ఇళ్లూ వాకిలి
- మూడురోజుల పండుగకు సిద్ధమైన జిల్లావాసులు

సంబురాల సంక్రాంతి రానే వచ్చింది. నేటి నుంచి మూడురోజులపాటు వరుసగా బోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజానీకం సిద్ధమైంది. సూర్యుడు దక్షిణాయణం చాలించి, ఉత్తరాయణంలోకి ప్రవేశించే సంక్రాంతికి ముందు రోజు వచ్చే బోగికి ప్రత్యేకత ఉంది. ఇంట్లోని పాతవస్తువులను బోగి మంటల్లో దహనం చేస్తే పీడ తొలుగుతుందనీ, చిన్నారులకు బోగిపండ్లు పోస్తే దిష్టిపోతుందనే ఆచారం ఆనవాయితీగా వస్తున్నది.

**- కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 13**

## ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమవుతూ..

- బావిలోకి కారు దూసుకెళ్లి యువకుడు మృతి
- బంధువులను కలిసి వస్తుండగా ప్రమాదం
- ప్రాణాలతో బయటపడ్డ మరో ముగ్గురు
- పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి శివారులో ఘటన



వినీత్‌రెడ్డి (ఫైల్)



వ్యవసాయబావిలో పడ్డ కారును క్రేన్ సహాయంతో తీస్తున్న సిబ్బంది

పెద్దపల్లి రూరల్, జనవరి 13 : మరో వారంలో ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఆ యువకుడు, అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరాడు. బంధువుల ఇంటికి వెళ్లొస్తూ కారు బావిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. మరో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, గ్రామస్తులు వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి అనుబంధ గ్రామం గుంటూరుపల్లికి చెందిన తుమ్మ విజయపాల్ రెడ్డి-విజయ దంపతులు పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని రంగంపల్లిలో నివాసముంటున్నారు. వీరికి వినీత్‌రెడ్డి (27), విక్రమ్‌రెడ్డి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు వినీత్‌రెడ్డి ఉద్యోగ రీత్యా ఆస్ట్రేలియా, విక్రమ్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డాడు. క్రిస్మస్ పండుగ సెలవుల నేపథ్యంలో గత డిసెంబర్‌లో వినీత్‌రెడ్డికి ఇంటికి వచ్చాడు. ఈ నెల 20న గాని, ఆ తర్వాత గాని మళ్లీ ఆస్ట్రేలియా వెళ్లాల్సి ఉంది. కాగా, శుక్రవారం తన బంధువైన నల్గొండ జిల్లా జనగాంకు చెందిన గాదె అఖిల్‌రెడ్డితో కలిసి గుంటూరుపల్లికి కారులో వెళ్లారు. అక్కడ కటుంబసభ్యులు, బంధువులను కలిసి 'నేను మరో వారంలో వెళ్తున్నా' అని చెప్పాడు. అర్ధరాత్రి వరకు అందరితో ఆనందంగా గడిపాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో అఖిల్‌రెడ్డి, నిమ్మనపల్లికి చెందిన దుగ్గెంపూడి సాయితేజరెడ్డి, అల్లం బాల అనురోహిత్‌రెడ్డితో కలిసి పెద్దపల్లికి తిరిగి బయలుదేరారు. నిమ్మనపల్లి శివారులో పెద్దకల్వలకు వెళ్లే మార్గంలో కారు అదుపు తప్పి దారి పక్కనున్న వ్యవసాయబావిలోకి దూసుకెళ్లింది. కారుతో నీటిలో మునిగిపోతున్న క్రమంలోనే సాయి తేజరెడ్డి డోరు తీసుకొని, ఈత కొడుతూ పైకి చేరుకున్నాడు. అక్కడ పెద్ద బండరాయి తీసుకొని కారు అద్దాలు పగులకొట్టాడు. దాంతో మరో ఇద్దరు అఖిల్‌రెడ్డి, బాల అనురోహిత్ రెడ్డి పైప్‌ను పట్టుకొని పైకి వచ్చారు. డ్రైవింగ్ చేసిన వినీత్‌రెడ్డి సీటు బెల్టు పెట్టుకోవడంతో బయటికిరాలేకపోయాడు. అప్పటికే సమాచారం అందడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. ఇటు పోలీసులు, ఫైర్ అధికారులకు వారంతా అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి 3.30 గంటల ప్రాంతంలో వినీత్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. శనివారం మధ్యాహ్నం కారును క్రేన్ సహాయంతో పైకి తెచ్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేశం తెలిపారు.

## 'గ్యారెంటీ దరఖాస్తుల గాయబ్'పై విచారణ

- మర్లపేట ఘటనలో బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం

రాజన్న సిరిసిల్ల, జనవరి 13 (నమస్తే తెలంగాణ): క్రమశిక్షణ ఉల్లంఘించి కొట్టుకున్న ఇద్దరు కార్యదర్శులపై చర్యలకు రంగం సిద్ధమవుతున్నది. బోయినపల్లి మండలం మర్లపేటలో ఆరు గ్యారెంటీల దరఖాస్తు కట్ట మాయమైన ఘటన బహిర్గతం కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వెనువెంటనే చర్యలు తీసుకొని మాయమైన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల కట్టను దొరకబట్టినట్లు అధికారులు చెబుతున్నారు. 'గ్యారెంటీ దరఖాస్తులు గాయబ్' అంటూ 'నమస్తే తెలంగాణ'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు అధికారులు నివేదించినట్లు తెలిసింది. మూడు రోజులు వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో మంగళవారం నుంచి విచారణ చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ తెలిపారు. కాగా, క్రమశిక్షణ కలిగిన కార్యదర్శులు ఓ అధికారి ముందే కొట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజా పాలనలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులపై అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అని చెప్పడానికి ఈ ఘటనలే నిదర్శనం.

## వరద కాలువకు నీటి విడుదల

ముప్కాల్, జనవరి 13: ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు 3వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేపలు పట్టేవారు, పశువుల కాపరులు, రైతులు, ప్రజలు వరదకాలువ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.